"మీరెప్పుడూ విషాదభరితమైన సీనెస్ మాత్రమే ఎందుకు రాస్తారు? జాలీగా, మనిషికి రిలీఫ్‌గా వుండే లౌ అఫైర్స్ అవీ కాకుండా పాఠకుణ్ణి ఏడ్పించే కన్నీటి కథలను మాత్రమే ఎందుకు మీరచనల్లో చిత్రిస్తారు...?" ఈ ప్రశ్నని నన్ను ఎందరో ఎన్నిసార్లో అడిగారు. కాని దానికి జవాబు నేనెప్పుడూ చెప్పలేదు. ఏమని చెప్పాలో కూడా ఎన్నడూ ఆలోచించ లేదు. అలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు చిన్నగా నవ్వి మాత్రమే బయటపడ్డాను ఇన్నాళ్ళూ... అవును... నేనెందుకు యిలాంటి సీరియస్‌గా ఇన్‌సెన్సివ్‌ను రాస్తున్నాను. నేనింతవరకూ రాసిన రచనలన్నింటినీ సమీక్షించుకుంటే దాదాపుగా అన్నింటిలో ఏదో ఆవేదన, తపన...సంఘంలో అలుముకున్న విర్వీర్యత కొట్టవచ్చినట్లు స్పష్టంగా కనబడుతున్నాయి. ఈ డిఫెక్ట్స్ అన్నింటినీ అధిగమించేందుకు ఏదో క్రొత్త పిలుపు...ఏదో సాధించాలనే ఉత్సుకత నా అన్ని రచనల్లోనూ తొంగి చూస్తోంది. ఎందుకు నాలోనాకు తెలియకుండానే నా గుండెలు దహించుకు పోతున్నాయి...ప్చ్... లాభం లేదు...ఈ సంఘాన్ని, పరిసరాలనూ యిప్పుడు నేను చూచే కోణంనుండి ఎవ్వరు చూసినా అంతా బీభత్సం, భయంకరంమాత్రమే కనబడుతుంది. గాని శృంగారం రాసేందుకు ఏ ఒక్క సంఘటన కూడా దొరకదు. కాని నేను యీ నా మానవాళిని యీ పవిత్రమైన కోణం నుండి కాక యింకే కోణంనుండికూడా దర్శించుకోలేను. అది నా బలహీనత. అందుకే నా రచనలు ఎప్పుడూ కన్నీటిని చిందిస్తుంటాయి. నా కలంలో ఎప్పుడూ, ఎవరో ఒక అశక్తుడి ఊపిరి ఆడుతూంటుంది.



# చదరంగం-పావులు

రామా చంద్రమౌళి

ఆలోచిస్తూ కూర్చున్నాను. తెలియకుండానే రాత్రి తొమ్మిదయింది. అంతసేపు అలా నిశ్శబ్దంగా కూర్చుని ఏదో ఏదో ఆలోచించిన నేను లోలోపల నవ్వుకున్నాను. ముందార టేబిల్ మీద చిందర వందరగా కాగితాలు, పెన్నూ, నా కథని ప్రచురించి ఆ రోజే ఎవరో వీక్లీ వాళ్ళు పంపిన తాలూకు వారపత్రిక...అప్పటినుండి జుట్టులోకి వ్రేళ్లుపోనిచ్చి ఆలోచించినందుకు నిక్కబొడుచుకున్న క్రాపు...నాపై కే...చిరాకేసింది. కడుపులో ఆకలి చిన్నగా శబ్దం చేస్తోంది. నాలాంటిబ్రహ్మచారులకు ఈ ఆకలి పెనుభూతంలాంటిది. చలి ఈదురుగా వచ్చి గిలిగింతలు పెడుతోంది. వీధిలో సద్దుమణిగింది. దూరాన ఎక్కడనుండో రేడియో పాట సన్నగా వినబడుతోంది. ఇంత రాత్రి హోటల్లోకి వెళ్ళి భోంచేసి రావాలి. తలంతా భారంగా ఉంది. మనస్సు అదోలా వికలమైపోయింది. వెళ్ళి భోజనం ముగించి అలాగే సినిమాకి వెళ్ళాలనుకుని డ్రెస్ వేసుకుని బయలుదేరాను.

శాంతి థియేటర్ ఇంకా కనుచూపు దూరంలో ఉంది. చలి వణుకు పుట్టిస్తూంటే చేతులుముడుచుకుని నిశ్శబ్దంగా నడుస్తున్నాను. అప్పటికే చాలా వరకు దుకాణాలన్నీ మూసివేయడం మూలాన రోడ్లు చాలావరకు ప్రశాంతంగా ఉన్నాయి. కాస్సేపాగి విల్స్ సిగరెట్టు ముట్టించుకొని మళ్ళీ నడుస్తున్నాను. నా ప్రక్కగా ఒక కారువచ్చి సర్రున ఆగిపోయింది. కాస్త ప్రక్కకి తప్పుకుని మళ్ళీ నడుస్తున్నాను. కారు డ్రైవరు "సార్" అంటూ పిలిచాడు, ఆగి చూశాను. ఆ కారులోనుండి ఒక స్త్రీ అంటే దాదాపుగా ఇరువది ఐదేండ్ల వయస్సుగలామె దిగి "నమస్కారమండీ" అంది. నేను నిజంగా ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఆమెను నేను ఇంతకు ముందెన్నడూ చూచి ఉండలేదు. అయినా మర్యాదకోసం ప్రతి నమస్కారం చేశాను.

"బహుశామీరుఆశ్చర్యపడుతున్నారు కాబోలు" అంది ఆమె సరిగ్గా నా ఉద్దేశాన్ని గమనించినట్లు.

"ఇంతకూ మీరు..."

"మీ అభిమాన పాఠకుల్లో నేనొక దానిని" స్పష్టమైన కంఠం.

నాలో కొంచెం గర్వంలాంటిది మెరిసి మాయమైంది. ఎందుకంటే నా అభిమాన పాఠకుల్లో ఇంత అందమైన ఆడది...యువతి ఒకరు ఉన్నందుకు.

"ఓహో" అన్నాను.

"మీతో ఎన్నోసార్లు మాట్లాడాలనుకున్నాను. కాని వీలుచిక్కలేదు. అనుకోకుండా ఇప్పుడు కనిపించారు. మీకు అభ్యంతరం లేకపోతే ఒకసారి నారూమ్‌కిరండి. కాస్సేపు మాట్లాడుకుందాం" ఆమె ఎంతో చలాకీగా, ఫ్రీగా చెప్పుకుపోతోంది.

నాలో మానవ సహజమైన బలహీనత ఏర్పడింది ఆమె ఆహ్వానిస్తున్నప్పుడు కాదనడం భావ్యంగా తోచలేదు. అదీగాక నా మనస్సులో కూడా ఆమెతో మాట్లాడాలనే ఆరాటం కొంచెం కొంచెం కలుగుతోంది. అయినా వరుసకి ఇంత రాత్రి ఎందుకులెండి మరెప్పుడైనా కలుసుకుందాం" అన్నాను.

"అలా అంటే కుదరదు. మీరు రావలసిందే" అంటూ నా చేతిని పట్టుకుని కారు దగ్గరగా లాక్కెళ్ళింది. ఆమె చొరవకు ఆశ్చర్యపోయాను.

వెళ్ళి బ్యాక్ సీట్‌లో కూర్చుని మరో సిగరెట్ వెలిగించాను. ఆమె నా ప్రక్కగానే కూర్చుంది.

కొంతమంది లేడీస్ తాము సోషియల్‌గా మూవ్ అవుతామని చెప్పుకుంటారు. వారు చాలా వరకు ఇలా ఫ్రీగా ప్రవర్తించవచ్చు. దానితో మనం వాళ్ళను అపారం చేసుకుంటే ...డి. ఇవి

వేకమే అవుతుంది.

"మీ పేరు".

"మాధవి"... మళ్ళీ నిశ్శబ్దం... అపరిచిత వ్యక్తితో అనుకోని ప్రయాణం.

"మీ ఇల్లెక్కడ"... కాలం గడపాలిగా.

"అసలు మాదీ వూరుకాదు. మద్రాసులో మా ఇల్లుంది. వ్యాపారవసరాలతో ఒక నెలక్రితం ఈ ఊరొచ్చాను. ప్రస్తుతానికి పారమౌంట్ హోటల్‌లో ఉంటున్నాను. మొన్ననే ఒకరోజు మా ఫ్రెండ్ దారిలో మిమ్మల్ని చూపించి మీ గురించి చెప్పింది. అంతకు ముందే మీ రచనల్ని చదివి ఆకర్షించబడ్డ నేను మీతో అప్పుడే మాట్లాడాలనుకున్నాను. కాని వీల్లేక పోయింది. మళ్ళీ ఇవ్వాళ కనిపించారు." సాఫీగా చెప్పుకు పోతోంది. "ఊఁ" కొడుతూ కూర్చుండి పోయాను నేను.

కాస్సేపట్లో కారు హోటల్ దగ్గర ఆగింది. మేమిద్దరం కారు దిగాము. కారు వెళ్ళిపోయింది. ఆమె హోటల్లోకి నడుస్తూ "రండి" అంది. నేను ఆమె వెనకాలే నడిచాను.

గదిలోకి వెళ్ళిన తర్వాత ఆమె నా ప్రక్కనే కూర్చుని చాలాసేపు మాట్లాడింది. అప్పుడప్పుడు ఆమె చేయి, ఒళ్ళు నాకు తగులుతుంది. నేనూ ఏదో పరధ్యాన్నంగా మాట్లాడుతున్నా మనస్సు ఆమె గురించీ, ఆమె ప్రవర్తన గురించీ ఆలోచిస్తోంది. కాని ఆమె తత్వమేమిటో పూర్తిగా అర్థం కావడం లేదు.

"మీ రచన అంటే నాకెంతో యిష్టం."

"థాంక్స్"

"మిమ్మల్ని చూచిం తర్వాత మీరంటే కూడా యిష్టమేర్పడింది" నా భుజాలపై చేతులు వేసింది. నే నప్రతిభుణ్ణియ్యాను.

"అంటే"

"మీ మీద ప్రేమ ఏర్పడింది" ఇంకాస్త దగ్గరగా జరిగింది.

స్త్రీ స్పర్శయే ఎరుగని నాలో ఏదో నూతనఅనుభూతి ప్రవహించింది.

"మీరేదో వేరే మూడ్‌లో వున్నారు ..." అక్షరాల్ని నములుతున్నాను.

"కాదు, మిమ్మల్ని నేను కోరుకుంటున్నాను."

స్త్రీ తలుచుకుంటే సర్వం సాధించగలదు. అన్నింటిని లొంగదీసుకోగలదు. లొంగనిదాన్ని, లొంగనివాడ్ని రభసచేసి తిమ్మిని బెమ్మి బెమ్మిని తిమ్మి చేయగలదు

సరిగ్గా అలాంటి అవ్యక్తమైన స్త్రీ శక్తికి లోబడే ఆ క్షణాల్లో నేనామెకు లొంగిపోయాను. తెరుకున్నాక "వెళ్ళొస్తాను" అన్నాను ఆమె ముఖంలోకి చూడకుండానే.

"గుడ్‌నైట్"

ఆమెకూ, నాకూ మధ్య పరిచయమూ, వీడ్కోలూ ఆ కొద్ది క్షణాల్లోనే జరిగిపోయింది

చీకటి చిక్కగా పరుచుకుంది. ఒంటరిగా రూమ్ వేపు నడుస్తున్నాను. మెదడు చుట్టూ ఆలోచనలు ఈగల్లా ముసురుకుంటున్నాయి. జరిగింది కలా నిజమా అనే మీమాంసలో కొట్టుమిట్టాడుతున్నాను. ప్రక్కనుండి సర్రున కారు దూసుకు పోయింది. అందులో ఆమె — మాధవి.

నడుస్తున్నాను. చలి ఎముకలను నమిలేందుకు ప్రయత్నం చేస్తోంది. సిగరెట్ వెలిగించేందుకు జేబులో చేయిపెట్టాను...షాక్...జేబులో పాకెట్ లేదు...ఒక్కక్షణం స్తబ్దత...విషయం పూర్తిగా అవగతమైంది...సాయంత్రమే అందుకున్న జీతం పూర్తిగా ప్యాకెట్టులో అంత చలిలోనూ ముచ్చెమటలు పోస్తున్నాయి.

"రచయిత మోసపోయాడు..." హృదయంలో వికటాట్టహాసం వినబడుతోంది.

మిథ్యతోనడిచిన నా తెలివితక్కువతనానికి తగిన శాస్తి యిలా జరుగవలసిందే... లేకుంటే రచనల్లో ఏదో సందేశం చిత్రించాలనే తనలాంటి ఇంప్రాక్టికల్ ఫూల్‌కి ఇలాంటి గతి పట్టవలసిందే.

వడివడిగా నడుస్తున్నాను.

ఇంకొక రెండుఫర్లాంగులు నడిస్తే నా రూమ్ వచ్చేస్తుంది.

రోడ్డంతా నిశ్శబ్దంగా వుంది. ఒక్క మనిషి కూడా నడవడంలేదు

అక్కడ చెట్టుక్రిందినుండి ఎవరో స్త్రీ చేతిలో కారియర్‌తో వేగంగా నడుస్తోంది రోడ్డుప్రక్కన స్తంభపు దీపం వెలుగులో ఆమె ముఖం కొంచెం కనబడింది. మళ్ళీ ఆశ్చర్యం ... ఆమె ... మాధవిలాగుంది... ఇదంతా ఏమిటి ? ఇంతకు ముందు కారులో మాధవి వెళ్ళిపోయింది. పావుగంటయిందో లేదో ఈమె. ఏదో దెయ్యాల తాలూకు సినిమా జ్ఞప్తికొచ్చింది. తొందర తొందరగా ఆమె దగ్గరగా నడిచాను. ఆమెకూడా చాలా వేగంగా నడుస్తోంది.

సందేహం లేదు. ఆమె మాధవి.

"మాధవీ" గంభీరంగా పిలిచాను.

ఆమె చటుక్కున ఆగి వెనక్కితిరిగిచూసింది. ముఖంలో భయం కూడా స్పష్టంగా కన్పిస్తుంది. కాని ఆశ్చర్యమేమిటంటే ఆమె కారులో వున్నప్పుడు వేసుకున్నబట్టలు యిప్పుడు ఆమె ఒంటిపై లేవు. అప్పుడు ఆమెలో వున్న నిండుతనం యిప్పుడులేదు. ఇప్పుడు ఆమె అతి సామాన్యంగా ఎవరో బీద స్త్రీలా స్పష్టంగా కనిపిస్తూంది.

"మాధవీ, మనిషిని ఇంత దారుణంగా మోసం చేసి నీవు సాధించేదేమిటి"


"క్షమించండి మీరు నన్ను పోలీసులకు వప్పగిస్తే నేనందుకు సిద్ధంగా ఉన్నాను. కాని నాక కొంచెం టైమివ్వండి. ఈ కారియర్‌ని ఆకలితో మాడిపోతున్న నా పిల్లలకిచ్చి రానివ్వండి శిలలా బ్రతుకుతూ విధిలేక నా పిల్లల పొట్టకోసం దుర్మార్గుల చేతుల్లో చదరంగంలో పావులా జీ స్తున్న నన్ను మీరేం చేసినా ఫరవాలేదు. కా దీనిని నా పిల్లల కందజేయనివ్వండి మీ కాళ్ళ పట్టుకుంటాను." ఆమె కన్నుల్లో కన్నీరు ధారగ కారుతోంది.

నేను అలాగే నిలబడ్డాను నిశ్చేష్టుడనై.

ఆమె గబ గబా నడిచి వెళ్ళుతోంది చేతిలో కారియర్‌తో.

చాలాసేపు ఆమె వంకే చూస్తూ నిలబడ్డ నేన ఒక్క నిట్టూర్పు విడిచాను భారంగా... అ జీవితం... ఇది సంఘం... వీళ్ళు మనుష్యులు.. ఇదంతా చదరంగం. వీళ్ళందరూ పావులు.

కాస్సేపయింతర్వాత రూమ్‌వేపు నడిచాను.



"చలిమంట" చిత్రకారుడు : గోపినాథం నరసింగరావు, కోరిసపాడు.